రికీ తెలియలేదు ఎవరైందీ ఆ శవం. కాని మూడునెలలు అద్దె బాకీ పడడంచేత, సుదర్శనం వెళ్ళిపోయిన మరునాడే ఇంట్లోంచి బలవంతంగా యిద్దరు ఫైల్వానులచేత గెంటించబడి పేవ్‌మెంటులమీద కాపురం చేస్తున్న శంకరానికి మాత్రం తెలుసు ఆ శవం ఎవరో. తల తిరిగిపోయింది. వెంటనే స్టేషనులోకి పరుగెత్తికెళ్ళి వొకమూల కూర్చుని, తనలో తనే గుండె పగిలేటట్టు యేడ్చాడు. "భగవంతుడా నాకలాంటి చావు వొద్దు. నన్ను చంపకు, నన్ను బతకనీ. నాకీమాటు వందరూపాయలేచాలు." అని ప్రార్థించాడు.

హీరాలాల్ దగ్గరకు పరుగెత్తాడు, ఆపిచ్చి బట్టలతో, ఎర్రబడ్డ కళ్ళతో. అవతారం కని పెట్టి "ఏం ప్రొద్దున్నే పరుగెత్తుకొచ్చావ్? రెండువందల రూపాయిల వుద్యోగస్థులు మా దగ్గర కొస్తారా" ఎత్తిపొడుపు తీవ్రంగా తగిలింది శంకరానికి. అయినా సంబాళించుకుని,

"లేదు సేఠ్‌జీ! నేను మిమ్మల్ని వదిలి యింకోళ్ళ దగ్గర పనిచెయ్యగలనా?" చేతులు జోడించాడు.

"అయితే, యీమాటు నీ జీతమెంతో తెలుసా?" ఠీవిగా ప్రశ్నించాడు.

"ఆఁ తెలుసు. వందరూపాయలు" లేని చిరునవ్వు తెచ్చుకున్నాడు శంకరం. సేఠ్‌జీ సంతోషంతో కొస్త టీ తీసుకొచ్చి యిచ్చాడు శంకరానికి. శంకరం జీతం ఇప్పుడు గుమస్తాల జీతం కన్నా యిరవైయే ఎక్కువ.

"నాకు గూడా ఎవడైనా యింత ధర్మపిండం పడేస్తే బాగుండును!" మళ్ళీమళ్ళీ ఆ మాటలే ప్రతిధ్వనిస్తూ వుంటాయ్ శంకరం చెవుల్లో.

స్కెచ్

# త్రిశంకు నరకం

కాలజ్ఞానం సుబ్బారావు

శూన్యంలోకి తదేక దీక్షతో చూస్తున్నాడు సుబ్బారావు. పార్కులో రేడియోనుంచి మధురమైన గీతాలు—బాలసరస్వతి పాడుతోంటే తనకి వినపడడం లేదు. వినపడినా కర్ణకఠోరంగానే ఉంది. కొందరు పిల్లాజల్లాతో-అప్పుడే పెండ్లయిన కొత్త సంసారులు భార్యాసమేతంగా వచ్చి ఉల్లాసంగా ఉంటే తనకేమో యింతటి విశాల ప్రపంచంలో దిక్కే లేదనిపించింది. విశ్రాంతికని పార్కుకు వెడితే తన కక్కడ ఏ విశ్రాంతి దొరకలేదు సరిగదా మనస్సులో తీరని వ్యథ ఏర్పడింది. బుర్ర సమస్యలమయమై కూర్చుంది. తనూ అక్కడ సంతోషంగా వుండేవాళ్ళ లెక్కల్లో మనిషే కదూ? మరైతే తన అవస్థ? చిరిగిన జుబ్బా జేబులో చెయ్యి పోనిస్తే ఓ బీడీ ముక్క దొరికింది. తనకది రిలీఫ్ నిస్తుంది. పక్కవాని ధర్మమా అంటూ నిప్పుకి వెతుకులాడ నక్కరలేకుండా పోయింది.

పాపం, నరసింహం తను పెండ్లి చేసుకోబోతున్నానని తనకెంత ఉప్పొంగి పోతూ చెప్పాడు! సంసారి అయ్యాకగాని ఆ కష్టాలు ఎవరికీ తెలీవు, ముఖ్యంగా నడిమంత్రపు తరగతి వాళ్ళకి. ప్రభుత్వాలు మారి చట్టాలు మారినా తన జీవితంలో నవ్వి యెరుగడు. చదువుకున్న రోజుల్లో సంపాదన లేకున్నా వారాలమీద నిశ్చితంగా బ్రతికాడు. వాళ్ల అమ్మ నీళ్లు మోసేది. బడి జీతానికి వారూ వీరూ ధర్మస్వరూపులు (యింకా కలికాల మహాత్మ్యం సోకనివాళ్లు) చందాలిస్తే సాఫీగా నడిచింది విద్యా జీవితం. మెట్రిక్‌తో తను విధిగా నిలవాలిసొచ్చింది. ఏదో తనకంతవరకు సాయం చేసినపుణ్యాత్ముల ధర్మమా అంటూ ఓగుమాస్తాగిరి చిక్కింది. గంతకుతగిన బొంతని పెండ్లి చేసారు. ఓ బిడ్డకూడా కలిగింది. అయిదేండ్లు తనకు తెలీకుండానే కాలం దొర్లుకపోయింది. భార్య రెండో కాన్పులో కాలం చెయ్యడం-తల్లి లేని

బిడ్డని సాకడం సుబ్బారావును కలవరపెట్టింది. కష్టాలువస్తే ఒకటిగా రావన్నట్లు బిడ్డకి టైఫాయిడ్ కూడ వచ్చింది. బిడ్డను రక్షించుకోవడానికి తల తాకట్టు పెట్టాల్సి వచ్చింది. ఆనాడనగా తీసిన అప్పు వడ్డీతో సహా పెరిగింది. మానవ సహజమైన వాంఛ తనలోనూ ఉండటం తన దురదృష్టం. రెండో పెండ్లికి ఎందుకు ఒప్పుకున్నాడు? వచ్చే రు. 75 లలో జీవితం ఎంత ఆనందప్రాయంగా గడుస్తుంది? తనేమో పస్తులకి అలవాటయ్యాడు. ఆ మొదటి పెండ్లామే కొద్దిగానో గొప్పగానో సుఖపడింది. కాలం మనది కానప్పుడు ఇంట్లో అడుగుపెట్టిన రెండోభార్య ఒక్క చీరతోనే మాన మర్యాదలు ఇతరులతో సమానంగా కాపాడుకోవాల్సి వచ్చింది. వ్యసనానికి బానిసయ్యాడు. సుబ్బారావు ఖేదం విషమించింది. అద్దెకుంటే యిల్లు ఉరుస్తోంది. ఇంటి యజమానికి చెబితే తన్నే ఖర్చుపెట్టి రిపేరు చేయమన్నాడు. రాకరాక మొన్న వానలువస్తే బయటచేరిన తన భార్య పండుకునేందుకు చోటు లేకపోయింది. ప్రక్కింటి పంతులమ్మ యింటరుగుమీన ఆమె అనుమతిపొంది నిద్ర పొమ్మన్నాడు. తను తడుస్తూనే "కుంపటి కప్పిన గుండెలతో" జాగ్రదావస్థలోనే పడుకున్నాడు. ఆ పంతులమ్మ తన భార్యని ఏమేమో ప్రశ్నలు వేస్తోంటే తన చెవుల్లో పోటు వేసింది. "నిద్రకు వెలియై కన్నులనిండిన కావిరితో, కావిరినిండిన కన్నులతో" తను ఆరాత్రి గడిపాడు.

ప్రభుత్వోద్యోగి తను అన్యథాతలిస్తే జైలు సంప్రాప్తిస్తుంది. స్వతంత్ర భారతం—తమే ఎన్నుకున్నారు: అయినా వాళ్ళేంచేస్తారు? వన మహోత్సవాలు ఫలవంతమయ్యేవి కాని రాయలసీమ రాళ్ళసీమ కావటంవల్ల మంత్రిగారి మంత్రలాభం లేకుండా పోయింది. ఆయన మహావాక్యాల ప్రకారం తను "దృఢచిత్తం" అలవాటు చేసికుంటున్నాడు. తన బిడ్డకి తండ్రి ఉన్నాడు, లాభం? అయిదేండ్లు నిండకముందే చాకిరీ చెయ్యడం వంశపారంపర్యంగా ఆ బిడ్డకి నేర్పారు. "జగమంతా నిదురలో మునిగినపుడు ఆ సద్దణగిన నడిరాతిరి" తనలో తానే ఆలపించేవాడు. ఇప్పటికీ ఇంటికి వీధికొనలో వుంటే కొళాయినుండి నీళ్ళు ముసలి తల్లి మోసుకవస్తూవుంటే తనలోని అవ్యక్తపు బాధ దేవుడెరుగు! తన జీవితం చాలవరకు "తిరిపెమునకు పిడికెడు మెతుకుల"తోనే గడచి పోయింది. జీవితంలో ఇంకా ఆనందమయ రోజులు వస్తాయని కరువుకాలు బెట్టింది రాష్ట్రంలో. ఎక్కడ చూచినా ఎముకల గూళ్లు. సుబ్బారావు బీడీ ముగించేప్పటికి ఓ భిక్షుకురాలు నిర్జీవప్రతిమవలె నుంచి ఓ బిడ్డను చంకనేసుకొని చెయ్యిచాచింది. తనదగ్గిర, అదీ నెలాఖరులో చిల్లిగవ్వ ఉంటుందీ? పాపం, ఆ అనాథ తిరిగి పోయింది. సుబ్బారావు చెయ్యగల్గిందల్లా జాలి పడడం. అసలు తన స్థితికి నిట్టూర్పువిడిచిన వాళ్ళైనా ఉన్నారా? సాయంత్రం కాగానే యాంత్రిక జీవితం చాలించి బయట పడేదే తడవుగా పార్కుకు కాస్త విశ్రాంతి కనివస్తే సుబ్బారావు బుర్ర వెనక్కి తిరిగి గతాన్ని నెమరవేసింది ఎవరో అన్నారు... కొన్ని గ్రామాల్లో క్షామం తాండవనృత్యం చేస్తుంటే మనుష్యులు చచ్చిన మృగాల ఎండిన ఎముకల గీకి ఆరగిస్తున్నారని. వాళ్ళలో పూర్తిగా మానవత్వం నశించినట్లుంది. తన కండ్లముందు ఆ దృశ్యం ప్రత్యక్షమయినట్లుంది. "నువ్వూ వాళ్ళను చేరబోతావా? తనకూ మానవత్వం నశించే సమయం వస్తుందేమో! ఒక్క తేనైతే బాగుండు. ఇంటిల్లిపాదీ కొనకేసుకొని "శవాన్వేషణ" చెయ్యాలా? నవ్వాడు. దూరంనుండి కొందరు తన్నుచూచి నవ్వుకుంటున్నారు. అప్పటికే చీకటి పడింది. రేడియో తన్ను లక్ష్యపెట్ట లేదన్నట్లు యింకా వాగుతోంది. పైగుడ్డ పైకేసుకొని ఇంటిముఖం పట్టాడు దారితోచని బాటసారిలా.

---

అనివార్య కారణాలవల్ల యీవారం "తారాపథం" శీర్షిక ప్రచురించలేకపోయాము. పాఠకులు మన్నింతురుగాక. పై వారంనుండి యథాప్రకారంగా ఆ శీర్షిక బొమ్మలతోసహా వెలువడుతుంది.—సం॥ తె. స్వ.